క్లుప్తంగా

సీసీఎస్ హెచ్‌సీ సీతయ్యకు ఆత్మీయ వీడ్కోలు



సీసీఎస్ హెచ్‌సీ సీతయ్యను సత్కరిస్తున్న సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్ : ఏలూరు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీవిరమణ చేసిన చిదరబోయిన సీతయ్యకు పోలీస్ అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి ఏలూరులోని స్టేషన్‌లో సీతయ్యను ఘనంగా సత్కరించారు. సీసీఎస్ సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ సీతయ్య 40 ఏళ్ళ సర్వీసులో క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో విధులు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగుల కోసం..

- మరోసారి జగన్‌ను గెలిపించాలి
- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని





ఏలూరులోని 43వ డివిజన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్లనాని చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ముఖ్యకార్యకర్తల సమావేశంలో నేతలు, కార్యకర్తలు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు జరగాలంటే.. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలోని 42, 43 డివిజన్లలో ఆదివారం రాత్రి ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఆయా డివిజన్లలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్టీ నేతలు, క్యాడర్ అభిప్రాయాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 58 నెలల కాలంలో రాష్ట్రంలో సంక్షేమంతోపాటు, అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని చెప్పారు. భయంకరమైన కరోనా విలయంలోనూ ప్రజలను సంక్షేమ పథకాలతో ఆదుకున్న ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుపెట్టుకోవాలని కోరారు. మరోవైపు ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా గూడు కల్పించేందుకు రాష్ట్రంలో సీఎం జగనన్న 33 లక్షల ఇళ్ళ పట్టాలు పంపిణీ చేస్తే..ఏలూరులో 33 వేల ఇళ్ళ పట్టాలు అందజేశామని ఎమ్మెల్యే నాని చెప్పారు. ఐదేళ్ళ కాలంలో ప్రజల ఖాతాల్లోకి రూ.2.64 లక్షల కోట్లు సొమ్మును సంక్షేమ పథకాల రూపంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ.. ఏలూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్ర సృష్టిస్తూ బీసీలకు రాజకీయ రంగంలో పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. 11 ఎంపీ స్థానాలు బీసీలకే ఇవ్వటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలతోపాటు, ఏలూరు ఎంపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో 42వ డివిజన్ కార్పొరేటర్ అర్జి సత్యవతి, 43వ డివిజన్ కార్పొరేటర్ జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి, పార్టీ నాయకులు అర్జి నాగేశ్వరరావు, పార్టీ మహిళా అధ్యక్షురాలు నున్న స్వాతిశ్రీదేవి, జనపరెడ్డి కృష్ణ, పార్టీ ముఖ్యనేతలు, పార్టీ ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

పెదవేగిలో 'చదవడం మాకిష్టం'



పెదవేగి గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెదవేగి : విద్యార్థుల భవిష్యత్తుకై చక్కటి పునాదులు వేసేందుకు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన చదవడం మాకిష్టం కార్యక్రమంపై విద్యార్థులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారని పెదవేగి గ్రంథపాలకుడు టి అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పెదవేగి శాఖ గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చదువుపై ఆసక్తి కలగాలంటే తరచుగా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని చెప్పారు. తరచుగా ఇష్టమైన పుస్తకాలను చదవడం అలవాటు చేసుకుంటే, ఇతర పాఠ్యపుస్తకాలపై మక్కువ ఏర్పడుతుందని అన్నారు. ఇలా క్రమేపీ విద్యపై ఆసక్తి పెరిగి చక్కటి మార్కులు సాధించవచ్చని ఆయన తెలిపారు.

వాహనాల తనిఖీ

బుట్టాయగూడెం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుట్టాయగూడెంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని పలు చోట్ల తనిఖీ బృందాలు క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసులు, నోడల్ అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి శివాలయం వద్ద పోలీసులు, ఎన్నికల అధికారులు వాహనాలను తనిఖీ చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

టీడీపీ, జనసేన నుంచి వలసలు



ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న 12వ డివిజన్ టీడీపీ, జనసేన కార్యకర్తలు, నేతలు



ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వన్‌టౌన్ టీడీపీ, జనసేన కార్యకర్తలు, నేతలు

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల జోరు పెంచింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పార్టీ విజయానికి తమ వంతు పాత్ర పోషించేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానికి మరోసారి పట్టం కట్టేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులన్నీ ఎన్నికల క్షేత్రంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే ఏలూరులో వైఎస్సార్‌సీపీ ప్రజల్లోకి దూసుకుపోతూ ఉండగా, ప్రతిపక్ష టీడీపీ ఢీలా పడింది. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని 12వ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆళ్ళ నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ ఎస్సీ సెల్ ఏలూరు వైస్ ప్రెసిడెంట్ బండ్లమూడి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు క్యాంపు కార్యాలయంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు సుమారు వంద మంది వైసీపీలో చేరారు. వారికి ఆళ్ళ నాని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, టీడీపీ, జనసేన అనైతిక పొత్తులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందన్నారు. కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా 58 నెలల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు చేసిందని స్పష్టం చేశారు. మంత్రిప్రగడ వేణుకుమార్ ఆధ్వర్యంలో సుమారు 100 మందికి పైగా టీడీపీ, జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యే ఆళ్ళనాని సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని ప్రతీ హామీని అమలు చేసి చూపించారని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇస్తే ఖచ్చితంగా అమలు చేస్తారని నమ్మకం ప్రజల్లో ఉందని తెలిపారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, సేవాదళ్ అధ్యక్షుడు యల్లాపు మోజెస్, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్వీ శివరావు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి : మహిమ గల తల్లి శ్రీరాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం అమ్మవారికి పూజా రుసుముపై రూ 41,311, విరాళాల వలన రూ 26,353, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.28,215, ఫొటోల విక్రయం ద్వారా రూ 3,825 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పరామర్శలు



కవ్వగుంటలో మాజి సర్పంచ్ మద్దాల నాగయ్యను పరామర్శిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : మండల వ్యాప్తంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలను, అలాగే ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. శనివారం రాత్రి పెదవేగి మండలం రాయన్నపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలగాని సత్యనారాయణ భార్య రమణని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యారావుపేటలో అంగలకుదురు లక్ష్మీనారాయణ, ముండూరు గ్రామానికి చెందిన చీమకుర్తి మాధవరావు, బట్టు రవికుమార్, చక్రాయగూడెం గ్రామానికి చెందిన రాజబోయిన పారిజాతం, బోట్ల సత్యవతి, వేగివాడ గ్రామానికి చెందిన జుజ్జూరి సత్యవతి, కవ్వగుంట గ్రామంలో అడ్డలూరు నాగరాజు, మేక నాగరాజు, మద్దాల వెంకమ్మ ఇటీవల మరణించగా వారి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించారు. లక్ష్మీపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన పలువురిని, పెదవేగిలో గ్రామంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పరామర్శించి అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కవ్వగుంట మాజీ సర్పంచ్ మద్దాల నాగయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులతో కవాతు

పెదవేగి : పెదవేగి మండలం పినకడిమి, రాయన్నపాలెం, కొండలరావుపాలెం గ్రామా ల్లో ప్రత్యేక భద్రతా బలగాలతో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం నెలకొనాలని, ఎన్నికల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకూడదని, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణ జరగాలని కోరుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి



కళానీరాజనం అభినందన కార్యక్రమంలో సోషల్ టీచర్లు, హిస్టరీ లెక్చరర్‌లు

ఏలూరు (టూటౌన్) : స్వాతంత్ర్య సమరయోధులు అమర వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళానీరాజనంలో పాల్గొన్న సోషల్ టీచర్లు, హిస్టరీ లెక్చరర్‌లకు అభినందన సభ నిర్వహించారు. స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు రామం భవన్ హేలాపురి బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ సభ జరిగింది. సభకు విజయవాడ లయోలా కాలేజ్ హిస్టరీ లెక్చరర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ బృందం పోరాటం, ప్రాధాన్యత అంశంపై మాట్లాడారు. నాడు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ ఏర్పాటు చేసి నిర్వహించిన ఉద్యమాల గురించి వివరించారు. భావి పౌరులను మంచివారుగా, గొప్ప సామాజిక దృక్పథం కలిగిన వారుగా చేయగల స్థానంలో సోషల్ టీచర్లు ఉన్నారన్నారు. సభలో సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ హిస్టరీ లెక్చరర్ కె.బ్రహ్మేశ్వరి, హేలాపురి బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పి.ఆంజనేయులు, జి.శారద, కె.శ్రావణి కుమారి, కె.శ్రీనివాసరావులు, యూటీఎఫ్ జిల్లా నాయకులు పీవీ నరసింహరావు, పి.ఆదిశేషు, వీజీఎంవీఆర్ కృష్ణారావు, కె.సోమ్లానాయక్, డి.హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం



రాజ్యలక్ష్మీ తాయార్ల సమేతంగా రథంపై ఊరేగుతున్న శ్రీ జనార్ధన స్వామి, శ్రీ రంగనాయక స్వామి



నగర వీధుల్లో రథోత్సవ కమనీయ దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ జనార్ధన స్వామి, శ్రీ రంగనాయక స్వామి రథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వార్లకు శ్రీ జనార్ధన స్వామి సుప్రభాత గోష్టి ప్రతినిధుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, నిత్యార్చన, సేవాకాలం, ఆరగింపు నిర్వహించారు. అనంతరం మంగళాశాసనాలు పలికి తీర్ధ ప్రసాద వినియోగం చేశారు. అనంతరం శ్రీ రాజ్యలక్ష్మీ తాయార్లకు సేవా కమిటీ ఆధ్వర్యంలో 108 కలశాలతో క్షీర తిరుమంజన సేవ నిర్వహించారు. సాయత్రం స్వామి వార్ల రథోత్సవం ఆలయం వద్ద నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయింది. స్థానిక వన్‌టౌన్‌లోని పలు ప్రధాన మార్గాల గుండా స్వామి వార్ల రథ తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చింది. దారి పొడవునా భక్తులు స్వామి వార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరనం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్ధ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05,07,10
బెండకాయలు	22	కంద	74
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-40	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	44	అల్లం	160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32-38	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	24-26	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	09
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	07
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు -తిరుపతి	16.00	4830	32

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



భీమడోలులో పురవీధుల్లో ఈత మట్టలతో క్రైస్తవులు

భీమడోలు: క్రైస్తవులు మ్రానికొమ్మల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రభువైన ఏసుక్రీస్తు పునరుత్థానం(ఈస్టర్) దినానికి ముందు వచ్చే ఆదివారంను మ్రానికొమ్మల ఆదివారం(మట్టల ఆదివారం)గా జరుపుకుంటారు. దావీదు కుమారునికి జయం జయం, యూదుల రాజా జయం, హోసన్న హోసన్నా అంటూ వారంతా చేసిన గీతాలు మార్మోగాయి. సుందరంగా అలంకరింపబడిన కొబ్బరి, ఈత మట్టలను చేత పట్టుకుని క్రైస్తవ గీతాలాపన చేస్తూ గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, పోలసానిపల్లి, సూరప్పగూడెం, లంక గ్రామాల్లో ఆర్‌సీఎం, సీఎస్‌ఐ, సీబీసీఎన్‌సీ, రక్షణసైన్యం తదితర క్రైస్తవ ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు ఫాదర్ షింటో విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏసుక్రీస్తు మానవుల పాపాల పరిహారం కోసం శిలువ వేయబడ్డారని, ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ మనమంతా సత్‌ప్రవర్తన, దయ గుణంతో తోటివారిని ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు నెల్సన్, జోషి, జింటో, కన్యస్త్రీలు, విన్సెంట్ డీపాల్ సభ్యులు, జీసస్ యూత్, దళ సభ్యులు, పెద్దలు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెదవేగి : తపస్సు కాలంలో పవిత్ర మాని కొమ్మల ఆదివారంను క్రైస్తవ విశ్వాసులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గ్రామ గ్రామానా ఆయా దేవాలయాల నుంచి విశ్వాసులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వాసులు ఆశీర్వదించిన కొబ్బరి తాళ పత్రాలతో, ఈత ఆకులకు పూలు గుచ్చి, క్రీస్తు రాజుకు జై, యూదుల రాజుకు జై, దావిదు రాజు జై అంటూ పురవీధుల్లో స్తుతిగానాలు చేశారు.

గ్రామాల్లో ర్యాలీ

దెందులూరు: గ్రామగ్రామాన క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం అన్ని గ్రామాల్లో అన్ని క్రైస్తవ దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి కోర్ ఆఫీసర్ రమణయ్య, కొవ్వలి కోర్ ఆఫీసర్ సుబ్బారావు, దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అమ్మన్‌రాజా, నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ గ్జేవియర్, పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.